సాక్షి చిత్తూరు

శనివారం । 23 । మార్చి । 2024



అభివృద్ధికి నమూనా.. నగరి

నగరి మున్సిపాలిటీ అభివృద్ధి పథంలో పయనిస్తోంది. ప్రజలకు అవసరమైన వసతులతో తులతూగుతోంది. - IIలో



మీ ఓటు ఉందా..

జాబితాలో ఓటు ఉందా చూసుకుని, లేకుంటే దరఖాస్తు చేసుకునే వెసులుబాటును అధికారులు కల్పించారు. - IIలో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ శనివారం (సా)	సహర్ ఆదివారం (ఉ)
చిత్తూరు	6.29	4.55
పుంగనూరు	6.31	4.59

న్యూస్‌రీల్

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

చిత్తూరు రూరల్: ఉద్యోగులు ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉండాలని, నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ ప్రభావతీదేవి స్పష్టం చేశారు. శుక్రవారం చిత్తూరులోని వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని, ప్రభుత్వ సేవలపై మాత్రమే దృష్టి పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు హర్షవర్ధన్, అనిల్, జానకీ, జయసింహ, శ్రీవాణి, రామ్మోహన్ పాల్గొన్నారు.

'కోడ్' ఉల్లంఘించిన ఉద్యోగులపై వేటు

చిత్తూరు కలెక్టరేట్/ రూరల్ : ఎన్నికల నిబంధనలకు వ్యతిరేకంగా ప్రచారంలో పాల్గొన్న ఇద్దరు ఉద్యోగులపై శుక్రవారం వేటు పడింది. చిత్తూరులోని జిల్లా ఆస్పత్రిలో కాంట్రాక్ట్ విధానంలో విధులు నిర్వర్తిస్తున్న కృష్ణమూర్తి గురువారం టీడీపీ నేతలు నిర్వహించిన ప్రచారంలో పాల్గొన్నారు. ఈ విషయం సాక్షి పత్రికలో శుక్రవారం ప్రచురితమైంది. దీనిపై జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్ విచారణ చేపట్టారు. కృష్ణమూర్తిని శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.

పెరుమాళ్లకండ్రిగలో సంఘమిత్ర–1

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన సంఘమిత్రను శుక్రవారం తొలగించినట్లు ఏపీఎం విజయభాస్కర్ తెలిపారు. ఈనెల 18వ తేదీన చిత్తూరు మండలం పెరుమాళ్లకండ్రిగ పంచాయతీలో టీడీపీ నేతలు నిర్వహించిన ఎన్నికల ప్రచారసభలో సంఘమిత్ర–1 లత పాల్గొన్నారు. దీనిపై ఎన్నికల అధికారులు విచారించి చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.

ప్రచారం.. ప్రకటనలకు అనుమతి తప్పనిసరి



షణ్మోహన్
జిల్లా ఎన్నికల అధికారి

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల్లో ప్రచారం, ప్రకటనలకు ఎంసీఎంసీ అనుమతులు తప్పనిసరిగా పొందాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రకటనలకు ముందస్తుగా ఆయా పార్టీలు పర్మిషన్ తీసుకోవాలన్నారు. కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ఎంసీఎంసీ కమిటీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కమిటీ చైర్మన్‌గా తాను, ఏఆర్‌ఓగా డీఆర్‌ఓ పుల్లయ్య, సభ్యులుగా సోషల్ మీడియాకు నాగేశ్వరరావు, కేంద్ర ప్రభుత్వ ఐ అండ్ వి మినిస్ట్రీ అఫిషియల్, ఎన్ఐసీ డీఐఓ సుధాకర్, మీడియా తరఫున సి.ప్రభాకరరావు, శ్రీనివాసమూర్తి, మెంబర్ సెక్రటరీలుగా డీఐపీఆర్‌ఓ పద్మజ వ్యవహరిస్తారని వివరించారు. ఎలక్ట్రానిక్, సోషల్‌మీడియా, ప్రైవేట్ ఎఫ్ఎంలలో ప్రసారాల కోసం, ప్రింట్ మీడియాలో ప్రకటనలకు కూడా ముందస్తుగా అనుమతులు పొందాలన్నారు. ఈ మేరకు వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అనుమతులు జారీ చేయనున్నట్లు తెలిపారు. అనుమతి లేకుండా ప్రకటనలు, ప్రసారాలు చేస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

1 నుంచి 'పది' మూల్యాంకనం

చిత్తూరు కలెక్టరేట్ : పదో తరగతి పరీక్షల మూల్యాంకనాన్ని ఏప్రిల్ 1వ తేదీ నుంచి నిర్వహించేందుకు చిత్తూరులోని పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ జిల్లాలకు సంబంధించి ఇప్పటి వరకు పూర్తయిన పరీక్షల జవాబుపత్రాలను పీసీఆర్ హైస్కూల్‌లోని స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తున్నారు. షెడ్యూల్ ప్రకారం సంబంధిత తేదీల్లో మూల్యాంకనం నిర్వహించనున్నారు. ఇందుకోసం సిబ్బంది నియామకం, మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిమగ్నమయ్యారు.

'నిధి'లో ఉద్యోగుల బీమా డేటా

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అన్ని శాఖల ఉద్యోగుల జీవిత బీమా సమాచారం ఇకపై నిధి పోర్టల్‌లో పొందుపరిచినట్లు ఏపీజీఎల్‌ఐ శాఖ డీడీ వెంకటేశ్వర్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల జీవిత బీమా వ్యవహారాలన్నీ నిధి పోర్టల్ ద్వారా నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇప్పటికే పాలసీదారుల ప్రీమియం, రుణం పొందిన వివరాలను నిధి పోర్టల్‌కు బదిలీ చేసినట్లు వివరించారు. ఏపీజీఎల్‌ఐ పాలసీ తీసుకున్న ఉద్యోగులు, రుణం పొందిన వారు ఆ పోర్టల్‌లో తమ డేటాను పరిశీలించి ధ్రువీకరించుకోవాలని సూచించారు. ఇందుకోసం ఏప్రిల్ 30 వరకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. అభ్యంతరాలుంటే dir- ccell- apgli@ ap. gov. in మెయిల్ చేయాలని కోరారు.

స్టోర్‌కు చేరిన విద్యుత్ పరికరాలు

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో స్టోర్‌కు విద్యుత్ పరికరాలు వచ్చాయని ఎస్ఈ కృష్ణారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 5వేల సింగిల్ ఫేస్, 2వేల త్రీ ఫేస్ మీటర్లు, 9 బ్రేకర్లు వచ్చాయని వివరించారు.

జిల్లావ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రచారంలో ముందంజలో ఉన్నారు. క్షేత్రస్థాయిలో ఇంటింటికీ వెళ్లి జనంతో మమేకమవుతున్నారు. సంక్షేమ.. అభివృద్ధి పథకాలను వివరిస్తున్నారు. ప్రజాసేవ చేసే అవకాశం కల్పించాలని విన్నవిస్తున్నారు. సుపరిపాలన కోసం మరోసారి ఆశీర్వదించాలని అభ్యర్థిస్తున్నారు. ఇదే సమయంలో కూటమి పార్టీల నేతలు టికెట్ల పంచాయితీలోని కొట్టుమిట్టాడుతున్నారు. ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించిన స్థానాల్లో సైతం ఆశావహుల అసమ్మతి కారణంగా ప్రచారంలో వెనకపడ్డారు.

చిత్తూరులో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి



మంగాడులో మంత్రి రోజా తరఫున ప్రచారం సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత రామ్‌ప్రసాద్‌రెడ్డి



ప్రచారంలో ఫ్యాన్ స్పీడ్!

- క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు
- పలు సంఘాలు, వర్గాల మద్దతు కూడగట్టేందుకు సమావేశాలు
- టికెట్ల కేటాయింపులో జాప్యం కారణంగా వెనుకబడిన కూటమి పార్టీలు

సాక్షి, చిత్తూరు : జిల్లాలోని చిత్తూరు పార్లమెంట్‌తోపాటు చిత్తూరు, పూతలపట్టు, పలమనేరు, పుంగనూరు. కుప్పం, జీడీ నెల్లూరు, నగరి అసెంబ్లీ నియోజక వర్గాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు నిర్విరామంగా ఓటర్లను స్వయంగా కలుస్తున్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించే కరపత్రాలను అందిస్తున్నారు. మరోవైపు అసంతృప్త నేతలను కలిసి బుజ్జగిస్తున్నారు. బూత్ కమిటీలతో సమావేశాలు నిర్వహించి సమన్వయంతో సమష్టిగా పనిచేసేలా దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ క్రమంలోనే టీడీపీ, జనసేన, బీజేపీ నేతల్లో సహకారం కొరవడడంతో ఆయా పార్టీల శ్రేణులు నిస్తేజంగా ఉన్నాయి. టికెట్ల పంచాయితీ తెగకపోవడంతో ఇప్పటికీ పలు నియోజకవర్గాల్లో అసలు ప్రచారం ప్రారంభించకపోవడం గమనార్హం.



సదుం మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి (ఫైల్)

- పలమనేరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి వెంకటేగౌడ ఇప్పటికే గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ప్రతి మండలంలో విస్తృతంగా పర్యటించారు. తాజాగా బూత్ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నారు. మొత్తం ఐదు మండలాల్లోని ఒక్కో బూత్‌కు 30 మంది చొప్పున 304 బూత్ కమిటీలకు దిశానిర్దేశం చేస్తున్నారు. పలమనేరు మున్సిపాలిటీతోపాటు మొత్తం 90 పంచాయతీల్లో ఎన్నికల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలను సిద్ధం చేసుకున్నారు. నేతలు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళుతున్నారు.

- నగరి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి ఆర్‌కే రోజా చేపట్టిన ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. తొలుత ఆమె నియోజవర్గంలోని అసంతృప్త నేతలు, ద్వితీయ శ్రేణి నాయకుల ఇళ్లకు స్వయంగా వెళ్లి మాట్లాడుతున్నారు. మరోవైపు ఆమె సోదరుడు రామ్‌ప్రసాద్ రెడ్డి పుత్తూరు, వడమాలపేట మండలాల్లో, ఆమె భర్త ఆర్‌కే సెల్వమణి పలు కుల సంఘాలతో భేటీ అవుతున్నారు. మంత్రి రోజా క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలతో మమేకమవుతున్నారు.

- గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి ముమ్మరంగా ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. ప్రస్తుతం శ్రీరంగరాజపురం మండలంలో మూడు రోజులుగా పర్యటిస్తున్నారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రచారం చేపడుతున్నారు. క్షేత్రస్థాయిలో నేతలు, గ్రామ పెద్దలను కలుస్తూ మద్దతు కూడగడుతున్నారు. కృపాలక్ష్మి వెంట డిప్యూటీ సీఎం నారాయణస్వామి ప్రచారంలో పాల్గొంటున్నారు.

- చిత్తూరు నియోజవర్గ పరిధిలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంసీ విజయానందరెడ్డి ప్రచారం ముమ్మరంగా చేస్తున్నారు. గుడిపాల, రూరల్ మండలల్లో ఉదయం 7 నుంచి 11.30 వరకు పర్యటిస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లోని పలు వార్డుల్లో సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8.30 వరకు ఇంటింటికీ వెళ్లి ప్రచారం సాగిస్తున్నారు. ఆయన వెంట మేయర్, డిప్యూటీ మేయర్, పార్టీ మండల అధ్యక్షులు, ఎంపీపీలు క్యాంపెయిన్‌లో పాల్గొంటున్నారు. మరోవైపు కార్మిక, వ్యాపార, ట్రేడ్, కుల సంఘాలతో సమావేశాలు నిర్వహించి వారి మద్దతు కూడగడుతున్నారు.

- కుప్పం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్ ప్రచారంలో దూసుకెళుతున్నారు. మరోవైపు ఆయన కుటుంబీకులు, పార్టీ నేతలు ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. ఉదయం 8 నుంచి 11 వరకు, తిరిగి సాయంత్రం 6 నుంచి 9 గంటల వరకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. ఇదే సమయంలో పలు సంఘాలు, సంస్థల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహిస్తూ మద్దతు కూడగడుతున్నారు.

- పూతలపట్టు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్ జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రచారం సాగిస్తున్నారు. అన్ని సంఘాల నాయకులు, లీడర్లను ప్రచారంలో భాగస్వాములు చేస్తున్నారు.



పి.కొత్తకోటలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్

- పుంగనూరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఆయనకు కేవలం తన నియోజకవర్గానికి మాత్రమే పరిమితం కాకుండా జిల్లావ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల తరపును ముమ్మరంగా ప్రచారం సాగిస్తున్నారు. పుంగనూరులో సైతం మోటారుసైకిళ్ల ర్యాలీ, ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఇక మంత్రి పెద్దిరెడ్డికి మద్దతుగా పార్టీ శ్రేణులు ఆయా మండలాల్లో ప్రతి రోజు ఉదయం 7 నుంచి 11 గంటల వరకు, తిరిగి సాయంత్రం 6 గంటల రాత్రి 8 గంటల వరకు ప్రచారం నిర్వహిస్తుండడం విశేషం.



పుంగనూరులో మంత్రి పెద్దిరెడ్డి తరఫున ప్రచారం చేస్తున్న ముస్లిం నేతలు

'కంచర్ల' కనుసన్నల్లో
మింగలేక.. కక్కలేక!

సీనియర్.. జూనియర్.. నాయకుడు.. కార్యకర్త ఇలాంటి తేడా లేవీ ఉండవు.. అధినేత సామాజికవర్గానికి చెందినవారైతే చాలు.. వారు చెప్పిందే వేదం.. వారి ఆదేశాలే శిరోధార్యం.. ఇది కుప్పం నియోజకవర్గ టీడీపీలో సాగుతున్న వ్యవహారం. ఎన్నికల వేళ సైతం ఇదే తంతు కొనసాగుతోంది. పార్టీ కార్యాలయం.. స్థితిగతులు.. ప్రచారం అంతా వారి కనుసన్నల్లోనే నడుస్తోంది. ముఖ్యంగా చంద్రబాబు ఇన్‌చార్జిగా నియమించిన కంచర్ల శ్రీకాంత్ ఆధిపత్యధోరణితో ఇతర వర్గాలకు చెందిన నేతల పరిస్థితి దయనీయంగా మారింది. తమ గోడు వినిపించుకునేవారే లేరని, మింగలేక.. కక్కలేక నలిగిపోతున్నామని పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తుండడం పట్టణంలో చర్చనీయాంశమైంది.



- టీడీపీలో ఓ సామాజికవర్గానిదే ఆధిపత్యం
- తమ్ముళ్ల మనోభావాలను దెబ్బతీస్తూ నేతల వ్యవహారం
- పట్టించుకునేవారు లేక కుంగిపోతున్న క్యాడర్

కుప్పం: స్థానిక నేతలపై నమ్మకం లేని చంద్రబాబు తన సామాజికవర్గానికి చెందిన ప్రకాశం జిల్లా వాసి కంచర్ల శ్రీకాంత్‌ను కుప్పం నియోజవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా నియమించారు. ప్రస్తుతం ఆయన ఆదేశాల మేరకే స్థానికంగా పార్టీ వ్యవహారాలు నడుస్తున్నాయి. ఈ క్రమంలోనే కుప్పంలోని టీడీపీ కార్యాలయ బాధ్యతలను సైతం శ్రీకాంత్ అనుచరుడు నరేష్‌కు అప్పగించారు. అలాగే అటవీశాఖ అధికారిగా పనిచేస్తూ వివిధ ఆరోపణలతో సస్పెన్షకు గురైన తమ సామాజిక వర్గానికి చెందిన కాలప్ప నాయుడు, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ , కుప్పం నియోజకవర్గ పార్టీ విస్తరణ కమిటీ చైర్మన్ సురేష్ సైతం శ్రీకాంత్‌తో జతకట్టి ఆధిపత్యం ప్రదర్శిస్తున్నారు.

నిస్తేజంలో క్యాడర్

కుప్పంలో పేరుకు చంద్రబాబు ఎమ్మెల్యే అయినా ఏళ్ల తరబడి స్థానిక నేతలే పార్టీని నడిపించారు. వారు ఇప్పుడు కంటికి కనిపించడం లేదు. సీనియర్లు సైతం అధినేత వార్నింగ్‌తో మనస్తాపం చెంది పార్టీ వ్యవహారాలకు దూరంగా ఉంటున్నారు. దీంతో శ్రీకాంత్, ఆయన అనుచరుల హవానే పార్టీలో కొనసాగుతోంది. వీరి వైఖరి నచ్చని టీడీపీ క్యాడర్ ఇంటికే పరిమితమైంది. తమకు విలువ ఇవ్వని చోట ఉండడం ఎందుకని మధనపడుతోంది. ఎన్నికల వేళ కూడా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో నిస్తేజంలోకి వెళ్లిపోయింది.

గతంలోనే మేలు..

కుప్పం నియోజకవర్గంలో సుమారు 30 ఏళ్ల పాటు పీఎస్ మునిరత్నం, మనోహర్ ఇన్‌చార్జిలుగా వ్యవహరించారు. అప్పుడే నాయకులు, కార్యకర్తలకు విలువ ఉండేదని సీనియర్ నేత ఒకరు తన మిత్రుల వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఇప్పుడు ఇన్‌చార్జి బాధ్యత వహించే వారిలో కనీస నైతిక విలువలు లేదని, కార్యాలయానికి వెళితే పలకరించే దిక్కు కూడా ఉండడం లేదని వాపోయినట్లు సమాచారం. రోజురోజుకూ పార్టీ పరిస్థితి మెరుగుపడాల్సింది పోయి దిగజారుతోందని వ్యాఖ్యానించినట్లు తెలిసింది.

అభివృద్ధిని ఆశీర్వదించండి

శ్రీరంగరాజపురం : రాష్ట్రాభివృద్ధికి అహర్నిశలు శ్రమించిన ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని తయ్యూరు, మెదవాడ, శెట్టివానత్తం, వేణుగోపాలపురం పంచాయతీల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మితో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డిప్యూటీ సీఎం మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. 2014 ఎన్నికల్లో చంరదబాబు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి, ఇప్పుడు మళ్లీ బూటకపు హామీలతో వస్తున్నారని విమర్శించారు. మంచి చేసి ఉంటేనే ఓటేయమని అడిగిన దమ్మున్న నేత జగనన్న అని కొనియాడారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు చేసిన మేలేంటో చెప్పుకోలేక పొత్తులతో కలసి వస్తున్న చంద్రబాబుకు మళ్లీ ఓటమి తప్పదని స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందించిన జగనన్నను జనం మరచిపోరని తెలిపారు. ప్రజలకు సేవ చేసేందుకు వస్తున్న కృపాలక్ష్మిని ఆదరించి గెలిపించాలని కోరారు. అభ్యర్థి కృపాలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఎనలేని కృషి చేశారన్నారు. ఆయన సేవలకు గుర్తించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యను తమ సమస్యగా భావించి పరిష్కారమని వెల్లడించారు. ఈ సందర్భంగా పెద్ద తయ్యూరు దళితవాడలో సర్పంచ్ వరదమ్మ ఆధ్వర్యంలో మంత్రి నారాయణస్వామి, కృపాలక్ష్మిని గజమాలతో సత్కరించారు. పార్టీ మండల కన్వీనర్ మణి, ఎంపీపీ సరిత, జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి, సర్పంచ్‌లు ఉమామహేశ్వరి, రఘునాథరెడ్డి, ధనంజయరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు ఆదిలక్ష్మి, నాయకులు మణి, జనార్ధన్, బాబు, తంబి, సుబ్రమణ్యం, శివలింగం, ఆనందరెడ్డి, రామనాథరెడ్డి, మురళి, నరసింహులు, రవి, వెంకటేష్, నారాయణస్వామి, మోహన్, విజయ్ పాల్గొన్నారు.



పెద్దతయ్యూరులో ప్రచారం నిర్వహస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి

క్రీడాకారుడికి మంత్రి అభినందన



భానుప్రకాష్‌ను అభినందిస్తున్న మంత్రి రోజా

నగరి : జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ చూపిన నగరి క్రీడాకారుడు భానుప్రకాష్‌ను మంత్రి ఆర్‌కే రోజా శుక్రవారం తన నివాసంలో అభినందించారు. క్రీడాకారుడు మాట్లాడుతూ గత ఏడాది అక్టోబర్‌లో మంత్రి తన చారిటబుల్ ట్రస్టు ద్వారా 8వ రాష్ట్రస్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారని, అందులో సత్తా చాటిన వారిని రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారని వెల్లడించారు. అందులో భాగంగా రాష్ట్రం తరపున బీహార్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని విజేతగా నిలిచామని వివరించారు. మంత్రి రోజా కారణంగానే జాతీయస్థాయి పోటీలకు వెళ్లే అవకాశం వచ్చిందన్నారు. అందుకే వారిని కలిసి కృతజ్ఞతలు తెలిపినట్లు వెల్లడించారు. మంత్రి రోజా మాట్లాడుతూ భానుప్రకాష్‌కు ఇంటర్ ఫీజును మినహాయిస్తున్నట్లు ప్రకటించారు.

క్లుప్తంగా

మ్యాథ్స్ పరీక్షకు 684 మంది గైర్హాజరు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా శుక్రవారం నిర్వహించిన గణితం పరీక్షకు 684 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ దేవరాజు వెల్లడించారు. మొత్తం 21,935 మంది విద్యార్థులకుగాను 21251 మంది హాజరైనట్లు తెలిపారు. 43 పరీక్ష కేంద్రాలలో సిట్టింగ్ స్క్వాడ్ ఏర్పాటు చేశామన్నారు. 10 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేసినట్లు వివరించారు.

ట్రాన్స్‌ఫార్మర్లకు పెరిగిన మరమ్మతులు

చిత్తూరు కార్పొరేషన్: వేసవి నేపథ్యంలో ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతులు పెరుగుతున్నదని డీఈ ఆనంద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ చిత్తూరు, పలమనేరు, మదనపల్లె, పుంగనూరు డివిజన్ల పరిధిలో నెలకు 200 వరకు ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు గురవుతున్నాయన్నారు. ఎండల కారణంగా భూగర్భ జలాలు తగ్గడంతో రైతులు ఎక్కువసేపు మోటార్లు వేస్తున్నారని, దీంతో లోడ్ పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతింటున్నాయని వివరించారు.

రూ.2.49లక్షల నగదు స్వాధీనం

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో శుక్రవారం ఓ వ్యక్తి నుంచి పోలీసులు రూ.2.49 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. టూటౌన్ సీఐ ఉలసయ్య తన సిబ్బందితో కలిసి కాణిపాకం బైపాస్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఐరాలకు చెందిన మహేష్‌నాయుడు కారులో నగదు పట్టుబడింది. నగదును ఖజానా శాఖ అధికారులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి


రాజశేఖర్ (ఫైల్)

శాంతిపురం : మండలంలోని బురడసిద్ధనపల్లెలో శుక్రవారం విద్యుదాఘాతంతో ఓ విద్యార్థి మృతి చెందాడు. వివరాలు.. గ్రామానికి చెందిన మురుగేష్ కుమారుడు రాజశేఖర్(17) బి.కొత్తకోటలోని ప్రభుత్వ రెసిడెన్షియల్ కాలేజీలో ఇంటర్ చదువుతున్నాడు. పరీక్ష రాసి ఇంటికి వచ్చిన రాజశేఖర్ పశువుల మేత కోసేందుకు సమీపంలోని చెట్టు ఎక్కాడు. పక్కనే ఉన్న హైటెన్షన్ వైరు కిందగా ఉండడంతో రాజశేఖర్ నరికిన చెట్టు కొమ్మ దానికి తగిలింది. దీంతో కరెంట్ షాక్ కొట్టి మరణించాడు. విద్యుత్‌శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తమ బిడ్డ కన్ను మూశాడని మృతుడి తండ్రి రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

అభివృద్ధికి నమూనా.. నగరి


నగరి వ్యూ

రెండు రాష్ట్రాల సరిహద్దులో.. తమిళం, తెలుగు భాషల మేళవింపుతో అలరారుతున్న నగరి పట్టణం. 2005లో మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యింది. అయితే గతంలో అందుకు తగ్గ అభివృద్ధి జరిగిందా అంటే అది ప్రశ్నార్థకమే. అయితే ప్రస్తుతం నగరి అభివృద్ధికి నమూనాగా మారిపోయింది. ప్రజావసరాలకు కావాల్సిన వసతులతో ఆకర్షణీయంగా రూపుదిద్దుకుంది. జనజీవనం హాయిగా సాగేలా సకల సౌకర్యాలతో ఆకట్టుకుంటోంది.

- ప్రజారోగ్య పరిరక్షణకు అర్బన్ హెల్త్ సెంటర్లు
- అత్యాధునిక వసతులతో ఏరియా ఆస్పత్రి
- ఆకట్టుకునేలా పార్కు
- సువిశాలంగా సిమెంట్ రోడ్లు
- ఆలయాలు.. చర్చిలు.. మసీదుల ఆధునికీకరణ

నగరి : నగరి, కొత్తపేట, కీళపట్టు, ఏకాంబరకుప్పం, కేవీపీఆర్‌పేట, సత్రవాడ, చింతలపట్టెడ, నగరిపేట, టీఆర్ కండ్రిగ, కరకంతాపురం, నెత్తం కండ్రిగ, కాకవేడు పంచాయతీలను విలీనంచేసి 25.6 కిలోమీటర్ల విస్తీర్ణంతో 3వ గ్రేడ్ మున్సిపాలిటీగా 2005లో నగరి మున్సిపాలిటీ ఏర్పడింది. గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం కారణంగా అభివృద్ధి అంతంత మాత్రంగానే కొనసాగింది. మున్సిపాలిటీకి ఉండాల్సిన హంగులు ఏవీ సమకూరలేదు. ప్రస్తుత పాలకుల కృషి కారణంగా నగరి విశేషంగా అభివృద్ధి చెందింది.

రూ.1.96 కోట్లతో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు


పుదుపేటలో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్

పుదుపేట, సత్రవాడలో రూ.1.96 కోట్లతో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు నిర్మించారు. ఒక డాక్టర్, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక ఫార్మసిస్ట్, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒక డేటా ఆపరేటర్, ఒక అటెండర్ ప్రజలకు అందుబాటులో ఉంటూ వైద్య సేవలను అందిస్తున్నారు. అన్ని రకాల వ్యాక్సిన్లు ఈ సెంటర్లలో ఉన్నాయి. ల్యాబ్‌లో 62 రకాల పరీక్షలు నిర్వహిస్తున్నారు.

నేతలకు చేయూత

మున్సిపాలిటీలోని మరమగ్గ కార్మికులకు ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల యూనిఫామ్ ఆర్డర్లను అందించింది. విద్యుత్ బిల్లును 94పైసలు తగ్గించింది. 2,650 మందికి నేత పెన్షన్లు అందిస్తోంది.

రోడ్లు, కాలువలు, కల్వర్టులు

పట్టణంలోని భీమానగర్, ఎన్‌టీఆర్ నగర్, రామ్‌నగర్ లాంటి ప్రాంతాలకు ప్రస్తుతం సిమెంటురోడ్లు, కాలువలు వచ్చాయి. వీటి కోసం 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.8.65 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.6.11 కోట్లు, జీజీఎంపీ నిధులు రూ.2.21 కోట్లు, సాధారణ నిధులు రూ.1.65 కోట్లు, ఎంపీ నిధులు రూ.17.5 లక్షలు వినియోగించారు. మున్సిపల్ పరిధిలో రూ.6.50 కోట్ల వ్యయంతో 11.05 కిలోమీటర్ల మేర సిమెంటు రోడ్లు వేశారు. రూ. 2.20 కోట్ల వ్యయంతో 4.84 కిలోమీటర్ల కాలువలు నిర్మించారు. రూ.65 లక్షల వ్యయంతో 5.2 కిలోమీటర్ల మేర తాగునీటి పైపులైన్లు ఏర్పాటుచేశారు. కల్వర్టుల నిర్మాణానికి రూ.40 లక్షలు ఖర్చు చేశారు. కీళపట్టు మార్గంలో కుశస్థలి నదిపై వంతెన నిర్మాణానికి రూ.8.4 కోట్లు మంజూరు చేశారు.

రూ. 1.09కోట్లతో ఆధునిక శ్మశానవాటికలు


ఆధునికీకరించిన శ్మశాన వాటిక

నగరి శ్మశాన వాటికను కాశీ విశ్వేశ్వర వైకుంఠం, ముక్తిదామం పేరిట రూ.1.09 కోట్ల నిధులతో నవీనీకరించారు. శ్మశానంలో ఎల్‌పీజీ గ్యాస్ క్రిమియేషన్ షెడ్డు, బర్నర్, చిమ్నీ, శ్మశానానికి ఆర్చి, రోడ్డు, ఉత్తర క్రియల మండపం, బాత్‌రూమ్‌లు, నీటి వసతి పనులు చేపట్టారు.

షాపింగ్ కాంప్లెక్స్‌లు.. సమావేశ మందిరాలు

మున్సిపాలిటీ ప్రారంభం నుంచి అందని ద్రాక్షగానే ఉన్న డైలీ మార్కెట్‌కు బీజం వేశారు. గుడ్‌విల్ బేసిస్‌లో బస్టాండు ప్రాంగణంలో మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తున్నారు. రూ.2.36 కోట్ల అంచనాతో చేపట్టిన ఈపనుల్లో తొలివిడగా రూ.55 లక్షల వ్యయంతో గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణం జరుగుతోంది. కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయం వద్ద, టీఆర్ కండ్రిగ దేశమ్మ దేవాలయంలోను సమావేశ మందిరాలు (మినీ కళ్యాణ మండపాలు) నిర్మించారు.

రూ.80లక్షలతో పార్కు

పట్టణంలో సుమారు రూ.80 లక్షలు వెచ్చించి అత్యాధునిక పార్క్ నిర్మించారు. మెడికేటెడ్ ట్రాక్, స్వింగ్ సీసా, ఊయల, మెర్రీ గో రౌండ్, బోట్ స్వింగ్ సీసా, స్లైడ్స్, కేరోసల్, పిక్నిక్ టేబుల్‌తో పార్క్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు.


నగరిలో నిర్మించిన పార్కు

ఆధ్యాత్మికాభివృద్ధి

మున్సిపల్ పరిధిలోని ఆలయాలు, మసీదులు, చర్చిలను ఆధునికీకరించారు. మున్సిపల్ పరిధి టీఆర్ కండ్రిగలోని దేశమ్మ దేవాలయం రూ.3.60 కోట్ల నిధులతో పునర్నించగా, సత్రవాడ చర్చికి నగరి జామియా, మక్కా మసీదులను రూ.24 లక్షల నిధులు విడుదల చేశారు.

సంక్షేమ ఫలాలు

మున్సిపల్ పరిధిలో అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయి.. 464 మందికి ఆరోగ్యశ్రీ పథకంలో రూ.34 లక్షల మేర వైద్యసేవలు అందుకున్నారు. 7,943 మందికి రూ.19 లక్షల మేర కంటి వెలుగు పరీక్షలు జరిగాయి. 12,560 మంది విద్యార్థులకు రూ.20.44 కోట్ల మేర అమ్మ ఒడి, 6,451 మందికి విద్యాదీవెన కింద 9.36 కోట్లు, 6,417 మందికి వసతిదీవెన కింద 6.27 కోట్లు అందింది. 7,795 మందికి పెన్షన్ కింద రూ. 97.74 కోట్లు, 863 మంది రూ.86.3 లక్షల మేర చేదోడు అందుకుంటున్నారు. 94 మందికి కాపునేస్తం కింద రూ.14 లక్షలు అందుతోంది. 429 మందికి ఈబీసీ నేస్తం కింద రూ.64 లక్షలు అందింది. 7,889 మంది మహిళలు రూ. 24.05 కోట్లు ఆసరా ద్వారా లబ్ధి పొందారు. 3,339 మందికి చేయూతగా 18.77 కోట్లు అందింది. 11,679 మందికి రూ. 10.94 కోట్లు మేర సున్నావడ్డీ రుణాలు, 2,382 మందికి రూ.180.06 కోట్ల బ్యాంకు లింకేజి రుణాలు, 2206 మందికి జగనన్న తోడు రూ. 2.21 కోట్లు అందింది. 2534 మందికి ఇళ్ల స్థలాలు, 3253 మందికి అందరికీ ఇల్లు పథకంలో రూ. 45.20 కోట్లు అందింది. 12,476 మందికి వైఎస్సార్ సంపూర్ణపోషణలో భాగంగా రూ. 1.71 కోట్లు ఖర్చు చేశారు. 253 మంది వాహన మిత్ర పథకం కింద లబ్ధిపొందారు.


కీళపట్టులో నిర్మించిన సమావేశ మందిరం

ఆక్సిజన్ ప్లాంటు, డయాలసిస్ వార్డు


ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ వార్డు

మున్సిపల్ పరిధిలోని ఏరియా ఆస్పత్రిలో రెండు ఆక్సిజన్ ప్లాంటులు ఏర్పాటుచేశారు. కిడ్నీ బాధితులు సుదూర ప్రాంతాలకు వెళ్లి డయాలసిస్ చేసుకునే అవసరం లేకుండా స్థానికంగానే డయాలసిస్ వార్డు ఏర్పాటుచేశారు. ఐదు డయాలసిస్ యంత్రాలు ఈ వార్డులో అమర్చారు.

పెరిగిన ప్రమాణాలు

పరస్పర స్థలమార్పిడిలో ఆర్టీసీ ఆధీనంలోని స్థలాన్ని మున్సిపల్ శాఖకు మంత్రి ఇప్పించి నూతన మున్సిపల్ కార్యాలయానికి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేయించారు. మున్సిపల్ పరిధిలోనే ఆర్డీవో, ఆర్టీఓ, డీఎస్పీ కార్యాలయాలు వచ్చాయి.

మున్సిపాలిటీ సమాచారం	
వార్డులు :	29
సచివాలయాలు :	17
విస్తీర్ణం :	25.6 కిలోమీటర్లు
జనాభా :	62,275
ఓటర్లు :	46302
నిర్మించిన కాలువలు :	4.84 కిలోమీటర్లు
నిర్మించిన రోడ్లు :	11.05 కిలోమీటర్లు
తాగునీటి పైపు లైన్లు :	5.2 కిలోమీటర్లు


ఆర్టీఓ కార్యాలయం


నీటి శుద్ధీకరణ ప్లాంటు

ఓర్వలేకే బలవంతపు ఆహ్వానాలు


వైఎస్సార్‌సీపీలో చేరిన గ్రామస్తులు

బైరెడ్డిపల్లె : వైఎస్సార్‌సీపీకి వస్తున్న ప్రజాదరణ ఓర్వలేకే టీడీపీ నాయకులు బలవంతంగా పలువురికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాజంపేట ఎన్నికల పరిశీలకుడు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప ఆరోపించారు. శుక్రవారం బైరెడ్డిపల్లె వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బెల్లంమడుగు గ్రామస్తులు పార్టీలో చేరారు. గురువారం బెల్లంమడుగులో పర్యటించిన మాజీ మంత్రి అమరనాథరెడ్డి గ్రామంలోని చింతచెట్టు కింద సేదతీరుతున్న కొందరు రైతులకు బలవంతంగా కండువాలు కప్పి ఫొటోలకు ఫోజులు ఇచ్చారని విమర్శించారు. ఈ పోకడలు నచ్చని గ్రామస్తులు వెంటనే సర్పంచ్ వెంకటేష్, ఎంపీటీసీ సభ్యుడు భాస్కర్‌మొదలితో కలిసి వచ్చి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వెల్లడించారు. ఎన్నికలు రావడంతో టీడీపీ నేతలు తమకు కనిపించిన వారికి కండువాలు కప్పేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ నేతలు


మంత్రి రోజాతో పార్టీలో చేరిన టీడీపీ నాయకులు

పుత్తూరు: పురపాలక పరిధిలోని కల్యాణపురం, ముద్దుకృష్ణాపురం, వినాయకపురంలోని టీడీపీకి చెందిన 50 కుటుంబాలవారు మంత్రి ఆర్‌కే రోజా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం ఈ మేరకు మంత్రి వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన రమేష్, సరోజమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. జగనన్న సైనికురాలిగా పని చేస్తున్న మంత్రి రోజమ్మతో కలిసి నడవాలని నిర్ణయించుకొన్నట్లు వెల్లడించారు. పార్టీలో చేరిన వారిలో వెంగమ్మ, మహేష్, మురుగేష్, మల్లీశ్వరి, వెంకటేష్, సుబ్రమణ్యం, రాజశేఖర్, మునిరత్నం ఉన్నారు.

పలమనేరులో..

పలమనేరు : పట్టణంలో 14 వార్డు అంబేద్కర్ నగర్‌లోని టీడీపీకి చెందిన 14 కుటుంబాల వారు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే వెంకటేగౌడ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో జానకిరాం, ఏసుపాదం, వినయ్,ప్రవీన్, వినోద్, వళ్ళెమ్మ, బేబీ, పద్మావతి తదితరులున్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మురళీకృష్ణ, పట్టణ మాజీ కన్వీనర్ మండీ సుధా, నాయకులు భరత్, ముజ్జు , హరీష్ పాల్గొన్నారు.


ఎమ్మెల్యే వెంకటేగౌడతో పార్టీలో చేరిన నేతలు

మీ ఓటు ఉందా.. సరిచూసుకోండి !

- జాబితాలో పేరు లేకుంటే దరఖాస్తుకు అవకాశం
- ఏప్రిల్ 15వ తేదీ వరకు వెసులుబాటు ఇచ్చిన ఎన్నికల సంఘం
- యువతకు అవగాహన కల్పిస్తున్న అధికార యంత్రాంగం


పుంగనూరు మండలంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో ఇప్పటి వరకు ఓటు నమోదు చేసుకోని యువతీయువకులకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవల షెడ్యూల్ విడుదల చేసిన విషయం విదితమే. ఈ మేరకు ఎన్నికల సంఘం వచ్చే నెల 15వ తేదీ వరకు ఓటుహక్కు నమోదుకు వెసులుబాటు ఇచ్చింది. 01-04-2024 తేదీకి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. ఈ మేరకు జిల్లాలో ఓటు హక్కుకు ఇంకా నమోదు చేసుకోని వారికి అధికార యంత్రాంగం అవగాహన కల్పిస్తోంది.

ఆన్‌లైన్‌లోనూ నమోదు

ఓటు హక్కు నమోదు కోసం ఆన్‌లైన్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందుకోసం ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో ఓటు కావాల్సిన వ్యక్తి ఫోన్ నంబరుతో రిజిస్టర్ చేసుకుని లాగిన్ కావాల్సి ఉంటుంది.

ఆఫ్‌లైన్ ద్వారా..

ఓటు హక్కు నమోదు కోసం ఆఫ్‌లైన్ (దరఖాస్తు చేసుకోవడం) ద్వారా ఫారమ్-6ను బూత్‌లెవల్ అధికారులు (బీఎల్‌ఓ)లకు ఇవ్వొచ్చు. ప్రతి నియోజకవర్గానికి ఈఆర్‌ఓ ని ఎన్నికల సంఘం నియమించింది. వారి కార్యాలయాల్లోనూ దరఖాస్తులు అందజేయవచ్చు. ప్రతి మండలంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్లకు ఓటు నమోదు కోసం దరఖాస్తు తీసుకునే అధికారాన్ని ఎన్నికల సంఘం కల్పించింది.


15.56 లక్షల ఓటర్లు

జిల్లాలో ఇటీవల విడుదల చేసిన తుది జాబితా ప్రకారం జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 15,56,247 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 7,66,440 మంది పురుషులు, 7,89,732, ఇతరులు 75 మంది ఉన్నారు. ప్రస్తుత ఓటరు జాబితా ప్రకారం అన్ని నియోజకవర్గాల్లోనూ పురుషులతో పోలిస్తే మహిళా ఓటర్లే అధిక సంఖ్యలో ఉన్నారు. పలమనేరు నియోజకవర్గంలో అత్యధికంగా 2,66,739 మంది ఓటర్లు ఉండగా, తక్కువగా చిత్తూరు నియోజకవర్గంలో 2,01,524 మంది ఓటర్లు ఉన్నారు.

నూతనంగా నమోదు చేసుకున్న యువ ఓటర్ల సమాచారం

నియోజకవర్గం	యువకులు	యువతులు	మొత్తం
పుంగనూరు	2,930	2,535	5,465
నగరి	2,801	2,316	5,117
జీడీ నెల్లూరు	2,597	2,044	4,641
చిత్తూరు	2,402	2,110	4,512
పూతలపట్టు	2,559	2,020	4,579
పలమనేరు	3,147	2,686	5,833
కుప్పం	3,330	2,606	5,936
మొత్తం	19,766	16,317	36,083


యువత ముందుకు రావాలి



యువత ఓటు హక్కుకు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సైతం దరఖాస్తు చేసుకోవచ్చు. కొత్తగా ఓటు హక్కు పొందేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. అయితే ఓట్ల తొలగింపు, మార్పులు, చేర్పులకు అవకాశం ఉండదు. కేవలం ఫారం-6కు మాత్రమే దరఖాస్తులు స్వీకరించబడతాయి.

– షణ్మోహన్, జిల్లా ఎన్నికల అధికారి

సద్వినియోగం చేసుకోవాలి



ఓటు హక్కు నమోదుకు ఎన్నికల సంఘం కల్పించిన అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలి .18 ఏళ్లు నిండిన వారితో పాటు ఇప్పటి వరకు ఓటు హక్కు లేని వారు కూడా నమోదు చేసుకోవచ్చు. ఓటు హక్కు పొందేవారికి సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓటు వేసే అవకాశం కల్పిస్తారు. ఐదేళ్ల పాటు ప్రజలను పాలించే పాలకులను ఎన్నుకోవడంలో ఓటే కీలకం.

– శ్రీనివాసులు, రిటర్నింగ్ అధికారి